సమస్యలను పరిష్కరించండి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 20 : వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. సోమవారం హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ అండ్ సీవరేజీ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, నియోజకవర్గ బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులు చేపట్టారని, మిగిలిన పనులు ప్రారంభించలేదన్నారు. తాగునీటి సరఫరాలో మురుగు నీరు వస్తుందని, దీంతో కొందరు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తే.. నిధులు లేకపోవడంతో పరిష్కరించలేక పోతున్నామని సమాధానం చెబుతున్నారని, ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని కోరారు. కూకట్‌పల్లిలో భారీ రిజర్వాయర్లును నిర్మించి, పైప్‌లైన్ పనులను చేపట్టామని అక్కడక్కడ మిగిలిన పనులను పూర్తిచేసేందుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నర్సింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీశ్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, సబీహా బేగం, మహేశ్వరీశ్రీహరి, మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, తూము శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, బీఆర్ఎస్ నాయకులు

జాతీయ జెండాను ఎందుకు తొలగించారు ?

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 20 : సొంత ఖర్చులతో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి చేశానని, ఆ విగ్రహం వద్ద పెట్టిన జాతీయ జెండాను ఎందుకు తొలగించారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే, జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాను ఎగురవేయకుండా, ప్రక్కనే ఉన్న కాంగ్రెస్ దిమ్మెకు పెట్టడం సరి కాదన్నారు. అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. పాతదిమ్మెకు జాతీయ జెండాను పెట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీ వంశీకృష్ణ, ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబు రావు, కో – ఆర్డినేటర్ సతీశ్ అరోరా, కృష్ణారావు, రాజేశ్ రాయ్, సాయి, గోపి, సతీశ్ రావు, వెంకటేశ్‌చౌదరి, పృథ్వీ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం క్యాంప్ ఆఫీస్‌లో అల్లాపూర్‌కు చెందిన బి.శ్రీనివాస్‌కు రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- కేపీహెచ్‌బీ కాలనీ

అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం

చివరి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులతో దుండిగల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ శంభీపూర్ కృష్ణవేణికృష్ణ

దుండిగల్, జనవరి 20 : దుండిగల్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా సేవలందించామని పురపాలక చైర్‌పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపాలిటీ పాలకవర్గం చివరి సాధారణ సర్వసభ్యసమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. చైర్‌పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి కృష్ణ మాట్లాడుతూ.. ఐదేండ్లలో దుండిగల్ మున్సిపల్ ప్రాంతాన్ని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కౌన్సిల్ సభ్యుల సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మరోసారి ముందుకు సాగుతామన్నారు.అనంతరం సభ్యులందరినీ చైర్‌పర్సన్ సన్మానించగా చైర్‌పర్సన్ దంపతులను అధికారులు, కౌన్సిల్ సభ్యులు సన్మానించారు.

సమావేశంలో వైస్ చైర్మన్ తుడుం పద్మా రావు, కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, గండిమైసమ్మ –దుండిగల్ తహసీల్దార్ మతీన్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, కుంటి అరుణ నాగరాజు, అమరం గోపాల్‌రెడ్డి, జక్కుల కృష్ణాయాదవ్, బొంగునూరి రమాదేవి, రాముగౌడ్, సాయి యాదవ్, బండారి మహేందర్ యాదవ్, బొంగునూరి నవిత, శివనూరి నవనీత, ఎల్లుగారి సత్యనారాయణ, భరత్ కుమార్, పీసరి బాలమణి, మౌనిక, బెంబడి వనిత, మాదాస్ వెంకటేశ్, అర్కల అనంతస్వామి ముదిరాజ్, కొర్ర శంకర్ నాయక్, జోస్సిన్, ఏఈసురేందర్ నాయక్, మేనేజర్ ప్రభాకర్, మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

కుత్బుల్లాపూర్, జనవరి 20 : పేట్ బషీరాబాద్ సర్వే నం. 25/1లో ఉన్న 3 ఎకరాల 5 గుంటల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుందని, ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరుతూ సోమవారం మేడ్చల్ జిల్లా టీపీసీసీ కార్మిక విభాగం అధ్యక్షుడు కందాడి సుదర్శన్‌రెడ్డి మేడ్చల్ కలెక్టరేట్, హెచ్ఎండీఏ శాఖలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దానిలో కొందరు ప్రైవేట్ వ్యక్తుల హస్తంలో ఉందదన్నారు. ప్రస్తుతం హెచ్ఏండీఏ అధీనంలో ఉన్నప్పటికీ దానిని ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే దీనిపై ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సంతోష్‌కుమార్

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 20 : తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కూకట్‌పల్లికి చెందిన సంతోష్‌కుమార్ నియమితులైయ్యారు. సోమవారం తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు చేతుల మీదుగా సంతోష్‌కుమార్ నియామక పత్రం అందుకున్నారు. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ రంగంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కీలకమైన బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణిలో సమస్యలపై ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్, జనవరి 20 : కుత్బుల్లాపూర్ – గాజులరామారం సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజలు పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. గాజుల రామారం సర్కిల్‌లో 9, కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో 6 సమస్యలపై ఫిర్యాదులు అందిన్నట్లు డీసీలు మల్లారెడ్డి, నర్సింహ తెలిపారు.

శంభీపూర్.. కార్యాలయంలో

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్ర జలు, సంక్షేమసంఘాల నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్సీని శం భీపూర్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ కోరగా.. ఎమ్మెల్సీ అధికారులతో మాట్లాడుతానని సానుకూలంగా స్పందించారు.

- దుండిగల్

కాలనీ అభివృద్ధికి అండగా నిలుస్తా..

మియాపూర్ : అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళీనగర్ కమిటీ సభ్యులు డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్ రావును సోమవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సభ్యులను అభినందించటంతో పాటు కాలనీ అభివృద్ధికి అండగా నిలుస్తానని, సమస్యలపై అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి తోడ్పాటునిస్తానన్నారు. కార్యక్రమంలో సాయిగౌడ్, రాము, వెంకట్‌రావు, పాండు, శ్రీను,అశోక్, మాణిక్యం, కృష్ణ, అక్షయ్ పాల్గొన్నారు.

చదువుకునేందుకు చేయూత

రూ.20 వేల చెక్కును అందజేస్తున్న లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ విజయ్‌కుమార్

మాదాపూర్, జనవరి 20 : పారిశుధ్య కార్మికురాలు సుశీల కుమార్తె మణిరూప పదోతరగతి చదువుతున్నది. ఫీజు కోసం సాయం చేయాలని కోరగా రూ. 20 వేల ఆర్థికసాయం చెక్కు రూపేణ ఇవ్వాలని లయన్స్ క్లబ్ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు చందానగర్ హుడా కాలనీలో సోమవారం లయన్స్ క్లబ్ సభ్యుడు తోపుగుండ మహిపాల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా తల్లి సుశీలకు జోన్ చైర్మన్ విజయ్‌కుమార్ సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో తోపుగుండ మహిపాల్ రెడ్డి, బసిరెడ్డి మధుసూదన్ రెడ్డి, శాంతి భూషణ్ రెడ్డి, రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, కృష్ణ, బర్కా మల్లేశ్ యాదవ్, రాజశేఖర్, మారం ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత ఆక్యూపంక్చర్ వైద్య శిబిరం

కాస్మిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యూపంక్చర్ అండ్ నేచురోపతి ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో ఉచిత ఆక్యూపంక్చర్ వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. రెండురోజుల పాటు కొనసాగిన ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు చేశారు. బీపీ షుగర్, థైరాయిడ్, ఆర్థరైటిస్, న్యూరోలాజికల్ వ్యాధులకు వైద్యం అందించారు. నిర్వాహకురాలు డాక్టర్ స్వప్న మాట్లాడుతూ.. ఆక్యూపంక్చర్ ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చునన్నారు. సమతుల్య ఆహారం, వ్యాయామం ముఖ్యమన్నారు. వైద్యులు, సిబ్బందిని కాలనీ వాసులు సన్మానించారు.

- మియాపూర్

హెచ్ఎం రాములుపై దాడికి నిరసన

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

దుండిగల్, జనవరి 20 : రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాములుపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి మండల శాఖ పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో నిజాంపేట్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ బాచుపల్లి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దర్శగల్ల నర్సింహులు, మాలీ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పోకల శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ పాల్గొన్నారు.

గురునాథం చెరువుకు పూర్వ వైభవం

నెక్సెస్ మాల్ సౌజన్యంతో గురునాథం చెరువుకు పూర్వ వైభవం తీసుకువస్తామని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. నెక్సెస్ సెలెక్ట్ కంపెనీ మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ పనులను సంస్థ ప్రతినిధులతో సోమవారం కార్పొరేటర్ పరిశీలించారు. చెరువు సమీప ప్రజలు పరిరక్షణకు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రాము,, స్థానికులు లోకేశ్, రమేశ్, అనీల్, రాజేశ్, సుధాకర్, బాబు పాల్గొన్నారు.

- మియాపూర్

కాలువ పనులు పరిశీలన

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట రోడ్ హోలిస్టిక్ హాస్పటల్ సమీపంలో చేపడుతున్న వరద నీటి కాలువ పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు సోమవారం పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పనులు వేగంగా చేపట్టాలని సూచించారు. పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు సహకరించాలని కోరారు. ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారంగా వీటిని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు , స్థానికులు పాల్గొన్నారు.

- మియాపూర్

మౌలిక వసతులు కల్పించాలి

జగద్గిరిగుట్టలో మౌలికవసతులు కల్పించాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జగద్గిరిగర్, లాస్ట్‌బస్‌స్టాపులో పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. తాగునీటిసరఫరా, డ్రైనేజీ ఆధునీకరణ, మోటార్ల మరమ్మతులపై అధికారులతో చర్చించి పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జగన్, ముత్యాలు, సత్తిరెడ్డి, వెంకటేశ్, బిక్షపతి, యాదగిరి, వేణు పాల్గొన్నారు.

- జగద్గిరిగుట్ట

మున్సిపాలిటీలో నేటి నుంచి వార్డుసభలు



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, గండిమైసమ్మ – దుండిగల్ తహసీల్దార్ మతిన్

దుండిగల్, జనవరి 20 : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం 21 నుంచి 24వ తేదీ వరకు దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డుల్లో వార్డుసభలను నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కే సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం ఆయన వార్డు కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. సభల్లో సంబంధిత అధికారులు ప్రజల వద్ద నుంచి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు సర్వే, రైతు భరోసాకు సంబంధించిన అప్లికేషన్లు పరిశీలించాలన్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హులైన వారి వివరాలు తీసుకుంటారని, అర్హులైన ప్రతిఒక్కరూ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కా ర్యక్రమంలో గండిమైసమ్మ తహసీల్దార్ స య్యద్ మతిన్, రెవెన్యూ అధికారి జీ ప్రభాకర్, మేనేజర్ బీ లక్ష్మయ్య, మున్సిపల్ ఇంజినీర్ బీ సురేందర్ నాయక్, టీపీఓ బీ సంజన, వార్డు ఆఫీసర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్, జనవరి 20 : ప్రభుత్వం అమలు చేయనున్న ఆహారభద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా వంటి పథకాలకు అర్హులను గుర్తించేందుకు నేటి నుంచి మూడురోజుల పాటు కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వార్డుసభలను జరుపనున్నట్లు కమిషనర్ కె.శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 23 వరకు స్థానిక కౌన్సిలర్, వార్డు కమిటీ సభ్యులు, సంబంధిత వార్డు అధికారి సంరక్షణలో జరిగే ఈ సభలో దరఖాస్తు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నలుగురు నిందితుల రిమాండ్

శేరిలింగంపల్లి, జనవరి 20 : బార్ అండ్ రెస్టారెంట్ల లైసెన్సులు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడిని నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ పెద్దలు, ఎక్సైజ్ అధికారులు తెలుసని నమ్మించి రాయదుర్గం పరిధిలో బార్ లైసెన్సుల అనుమతుల పేరిట ఇద్దరిని మోసగించి రూ. 80 లక్షల కాజేసిన విషయం విధితమే. బాధితులు కోకాపేటకు చెందిన నాగార్జున, కొంపల్లి ప్రాంతానికి చెందిన ధర్మారెడ్డి ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడు మాదాపూర్ అయ్యప్ప సొసైటీకి చెందిన నందారామ్ మిడిదొడ్డి వెంకటపవన్ నందన్‌తో పాటు మరో ముగ్గురు.. మాదాపూర్ గాయత్రి నగర్‌కు చెందిన అబుసాయి ప్రకాశ్‌రెడ్డి, ఎస్ఆర్ నగర్‌కు చెందిన ఇరుపుల పవన్ కుమార్, మణికొండ జైహింద్ కాలనీకి చెందిన మహమ్మద్ అబ్రార్ హుస్సేన్‌లను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మహా ప్రదర్శనను విజయంతం చేయండి

మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులతో ర్యాలీలో పాల్గొన్న నాయకులు

దుండిగల్ : ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు.. వేల గొంతుకలు మహా ప్రదర్శనను విజయంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. నిజాంపేట్‌లోని హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాల వరకు 50 డప్పులతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు ర్యాలీ నిర్వహించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులతో నిజాంపేట్ దళిత సంఘాల ఐక్యవేదిక చైర్మన్ మేకల నగేశ్ అధ్యక్షతన కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్.వై.అశోక్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, సీనియర్ జర్నలిస్టు, ఎంజేఎఫ్ రాష్ట్ర నాయకులు ముక్కెర్ల లాలయ్య మాదిగ, మహాజన వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర కో– కన్వీనర్ డప్పు రామస్వామి, మేడ సంజీవ, జలగం చంద్రయ్య, బుర్కి రాములు, మేకల బాలకృష్ణ, ప్రేమ్ కుమార్, మేకల క్రాంతి, రామకృష్ణ, బాలపీరు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. 30 ఏండ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ అమలు దగ్గరలోనే ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

చర్లపల్లి, జనవరి 20 : కాలనీలను ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని వీఎన్‌రెడ్డి నగర్ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, డ్రైనేజీ సమస్యలను త్వరగా పూర్తి చేసి ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారులను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు పారిశుధ్య సమస్యలను పరిష్కరిస్తున్నామని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌బీకాలనీ, మాల్లాపూర్ కార్పొరేటర్లు జెర్రిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కనకరాజుగౌడ్, బన్నాల ప్రవీణ్, వంజరీ ప్రవీ ణ్, కుమార్‌స్వామి పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 20 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి.(కేజీ – రూపాయల్లో ..) టమాట 13, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 40, కాకర 35, బీరకాయ 35, క్యాబేజి 13, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 32, కాలీఫ్లవర్ 30, దొండ 42, చిక్కుడు 45, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 40, ఆలుగడ్డ 27, కీరా 25, దోసకాయ 20, సొరకాయ 20, పొట్లకాయ (1) 20, కందగడ్డ 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 32, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 10 నుంచి 12, పచ్చిబఠాని 40, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 200, అల్లం 80, వెల్లుల్లి 340, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9:30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.